
ఈ వారం కథ

- కమలకుమారి

# శిక్ష



**చందమామ అందంగా వెలుగుతున్నాడు. కాలుష్యపు పొగల్నీ, కుళ్ళు కాలువల్నీ, చెవుల్ని హోరెత్తిస్తున్న వికృత ధ్వనులనీ, వెన్నెలంటూ ఒకటుందని మరిచిపోయిన మనుషుల్నీ, ఆ మనుషులుండే జనారణ్యాలనీ తప్పించుకుని అడవిలోకొచ్చిపడ్డ వెన్నెల హాయిగా ఊపిరి పీల్చుకుంది.**

'వచ్చేశావా! నీ కోసమే చూస్తున్నాను. అక్కడ ఊపిరాడకే నేనూ ఇక్కడికి పారిపోయి వచ్చేశాను' వెన్నెలని పలకరిస్తూ చెప్పింది పిల్లగాలి.

చెట్ల కింద, సెలయేటి ఒడ్డున, విశాలంగా పరచుకున్న జాగాలో సభ తీర్చాయి జంతువులన్నీ. జాగా కోసం వెతుక్కుంటున్న లేడికి పులి కొంచెం జరిగి చోటిచ్చింది. అల్లిబిల్లిగా గంతులేస్తున్న అల్లరి కుందేలు పిల్లని కోప్పడి ఒడిలో కూర్చోబెట్టుకుంది తోడేలు. ఉడత గబగబా చెట్టెక్కి ఇంకా జంతువులేమైనా వస్తున్నాయేమోనని చూస్తోంది. నక్క వచ్చిన వాటిని లెక్కబెడుతోంది.

'ఇంత ఆలస్యంగానా రావడం' అని పాముని మందలిస్తోంది కప్ప. మొత్తం మీద సభంతా కోలాహలంగా ఉంది.

అప్పుడు అడవి మారుమోగేలా గర్జిస్తూ సభలోకి ప్రవేశించింది సింహం. జంతువులన్నీ ఓ నిముషం నిశ్శబ్దంగా నిలబడి మళ్ళీ కూర్చున్నాయి. చెట్టు కింద ఎత్తుగా ఉన్న రాతిమీద కెక్కి నిలబడి అన్నిట్నీ ఓసారి కలియజూసింది సింహం.

'సభికులారా! మన ఈ సర్వజంతు సమావేశానికి మొత్తం జంతులోకం అంతా వచ్చేనట్టేనని భావిస్తాను. ఏమంటావు మిత్రమా...!' అంటూ నక్కవేపు చూసింది.

సందిగ్ధంగా ఓ క్షణం ఆగింది నక్క. అన్నీ వచ్చిన మాట నిజమే. కానీ ఇప్పుడు కొన్ని జంతువులు కన్పించడం లేదు. మృగరాజుకి అసలే క్రమశిక్షణంటే ప్రాణం... నక్క ఏదో అనబోయే లోపల దూరంగా ఉన్న చెట్లచాటు నించీ గోలగోలగా అరుపులు వినపడ్డాయి. నక్క మరో నాలుగైదు జంతువులూ అటు వెళ్ళాయి.

అక్కడ చెట్లవారన హోరాహోరీగా కాట్లాడుకుంటున్నాయి కుక్కలూ పిల్లులూ పందులూ గొర్రెలూ గాడిదలూ దున్నపోతులూ.

'సభ కోసం వచ్చి ఇలా కుమ్ములాడుకోవడమా! అయ్యయ్యో! ఎంత పరువుతక్కువ...' సిగ్గు పడిపోయాయి జంతువులన్నీ.

'ఆగండాగండి! ఎందుకలా కొట్టుకుంటారు? మృగరాజు కూడా వచ్చేశాడు. సభ ప్రారంభం కాబోతూంది. ఈ సమయంలో ఇలా చెయ్యడం తప్పు. రండి సభకి వెళ్దాం.' అంటూ వాటి మధ్యలో దూరి హితవు చెప్పబోయిన మునలి ఎలుగుబంటిని అన్నీ కలిసి ఓ తోపు తోసేశాయి. ఇదంతా చూస్తున్న ఏనుగుకి ఒళ్ళు మండి గబగబా ముందుకెళ్ళి వాటన్నిటినీ తొండంతో తలో మూలకీ గట్టిగా నెట్టేసింది. ఆ తోపుకి కిందపడి నడుం విరిగినంత పనయాక వాటి జోరు కొంచెం తగ్గింది. గోల తగ్గించి నిశ్శబ్దంగా నిలబడ్డాయి.

'ఆ! ఇప్పుడు చెప్పండి. ఏమిటి మీ సమస్య?' అడిగింది ఎలుగుబంటి.

'ముందు వరసల్లో మృగరాజుకి దగ్గరగా మాలో ఎవరు కూర్చోవాలి?' అన్నీ కలిసి ఒకేసారి గట్టిగా అరిచాయి.

'చూడండి! మేం విశ్వాసానికి పెట్టింది పేరు. సాటి మనిషిని కల్లో కూడా నమ్మని మనుషులు మమ్మల్ని నమ్ముతారు. మా పేర కోట్ల విలువచేసే ఆస్తులు రాసిన వాళ్ళున్నారు. మనుషులు అంతగా గౌరవించే మేం ముందు వరసల్లో కూర్చోవాలా వద్దా...' గర్వంగా తోకెత్తింది కుక్క.

'వేన్లలో ఎక్కించి గేస్ ఛాంబర్లలోకి తోలి మరీ మీ జాతిని మట్టుబెట్టేది కూడా మనుషులే. ఆ సంగతి చెప్పవేం... చాలించు నీ గొప్పలు. మనుషులు నిజంగా ప్రేమించేది మా జాతిని. మహామహా గొప్పవాళ్ళ పడకగదుల్లో దూరి వాళ్ళ పక్కల మీద పడుకున్న ఘనత మా జాతికే సొంతం. అలాంటి మేం ముందర కూర్చోవాలి గానీ కుక్క బతుకు బతికే మీరా...?' ఈసడించింది పిల్లి.

'చాల్చాలు. ఆపు నీ గొప్పలు. నువ్వు కనపడటమే పెద్ద దుశ్శకునంగా భావించే మనుషులు నిన్ను ప్రేమిస్తారా? అసలు నీ మీద వాళ్ళెన్ని సామెతలు చెప్పుకుంటారో తెలుసా నీకు? మీవి తిండిదండగ జాతులు. మనుషులకి నిజంగా ఉపయోగపడేది మేము. కష్టపడి చాకిరీ చెయ్యడంలో మేం పెట్టింది పేరు. ఇంత గడ్డోగాదమో ఆకో అలమో పడేస్తే చాలు జీవితాంతం విశ్వాసంగా పనిచేస్తూ పడి ఉంటాం. కాబట్టి ముందు చోటు మాదే' గాడిదా దున్నపోతూ ఒకేసారి అన్నాయి.

వాటి మాటలకి మిగతా జంతువులన్నీ విరగబడి నవ్వడంతో వాటి ముఖాలు చిన్నబోయాయి.

'హు! మనిషికి సర్వవిధాలా ఉపయోగపడటమే కాకుండా వారి విసర్జనల్ని తిని పర్యావరణాన్ని కాపాడటంలో కూడా ముఖ్యపాత్ర వహిస్తున్నాం. కాబట్టి ముందు మేం కూర్చోవాలి' తలాడించుకుంటూ గర్వంగా చెప్పింది పంది.

'ఆపండి మీ ముగ్గురూ. మనుషుల చేత మీ అంత తిట్లు తినే జాతులు ఇంకోటి లేవు. మీ ముగ్గురితో పోల్చబడటంకన్నా వాళ్ళు సిగ్గుపడే విషయం ఇంకోటి లేదు. నిజానికి మనుషులకి మీ అందరికన్నా ఉపయోగపడేది మేము. అంతేకాదు పవిత్ర కార్యాల్లో బలులివ్వడానికి కూడా మీరెవరూ పనికిరారు మేం తప్ప! అంత ఘనతని సాధించిన మేం కదా ముందు కూర్చోవాల్సింది...' దర్పంగా అడిగింది గొర్రె.

'అరే! బలిపశువు కావడం కూడా పెద్ద గొప్పన్నట్టు మాటాడతావేం? మనుషులు మిమ్మల్ని వెర్రిగొర్రెలని ఊరికే అనలేదు. మీ జాతికున్న బుద్ధిహీనతంతా నీ మాటల్లోనే తెలుస్తుంది...' ఓండ్ర పెడుతూ నవ్వింది గాడిద.

సరి, మళ్ళీ యథాప్రకారం కుమ్ములాట మొదలైపోయింది.

'ఛీఛీ! అసలు బుద్ధుందా మీకు? ఇదేం బజారో, బస్టాండో, రైల్వేస్టేషనో కాదు. రేషన్‌షాపో, సినిమా హాలో అంతకన్నా కాదు. అసలిది వూరే కాదు అడివి. సభ కోసం వచ్చి ఇలా నానా గోలా చేస్తారా... మీరు జంతు పుట్టుక పుట్టలేదూ? ఇలా... మనుషుల్లా ప్రవర్తించడానికి మీకు సిగ్గెయ్యడం లేదూ?' తిట్టింది ఎలుగుబంటి.

'ఇంత చిన్న విషయానికి ఇంత రాద్ధాంతమా? మనుషుల దగ్గర ఉండీ ఉండీ వాళ్ళ బుద్ధులు బాగా వంటపట్టించుకున్నారే. తప్పనిసరై పిలిచాం గానీ... మిమ్మల్నసలు పిలవకుండా ఉండవలసింది' చీదరించుకుంది ఏనుగు.

'చూడండీ! మీరు ముందు చోట్ల మాట దేవుడెరుగు. అసలు కూర్చోవడానిక్కూడా జాగా మిగల్లేదు. గొడవాపి మర్యాదగా సభకొచ్చి ఏ మూలో నిలబడతారా... సరేసరి. లేదంటారా... తోకలు ముడిచి వెనక్కి తిరిగి మీ మనుషుల్ని వెతుక్కుంటూ వచ్చినదార్నే తిరిగి ఫొండి. ఈ గొడవంతా తెలిస్తే మృగరాజు మిమ్మల్నసలు సభకే రానివ్వడు తెలిసిందా?' మందలించింది నక్క.

అక్కడితో గొడవ అణిగింది. కిక్కురుమనకుండా నక్క వెనకాలే సభ జరిగే స్థలానికి వెళ్ళి వేటికి దొరికిన

జాగాలో అవి ఎలాగోలా సర్దుకున్నాయి.

సింహం సభ నంతట్నీ ఓసారి కలియజూసి 'సభ్యులారా! ఇవాళ మన మీద ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయి. వాటికి కారణం ఎవరో మనలో ప్రతీ ఒక్కరికీ తెలుసు. మన మనుగడ కోసం అవసరమైన నిర్ణయాలు తీసుకోవడం కోసమే ఈ సభని ఏర్పాటు చేసుకున్నాం. అందువల్ల ఈ మధ్యకాలంలో దారుణమైన హింసలకి గురై తన జాతి వారెందర్నో పోగొట్టుకున్న పెద్దపులిని ఈ సభకి అధ్యక్షత వహించవలసిందిగా కోరుతున్నాను' అంది.

పెద్దపులి గంభీరంగా నడుస్తూ వెళ్ళి సింహం పక్కన నిల్చొని అధ్యక్షోపన్యాసం ప్రారంభించింది.

'సభ్యులారా! ఒకప్పుడు భూమిలో చాలా భాగం అడవులూ కొండలతో నిండి ఉండేది. మన జంతులోకం చీకూ చింతా లేకుండా గడిపిన బంగారు కాలమది. మరి తిరిగి రాదు. ఇప్పుడు అడవులనే ఏమిటి - మహాపర్వతాలే మట్టిగడ్డల్లా కరిగిపోతున్నాయి. తరిగిపోతున్నాయి. ఓ నాలుగు తుప్పలు ఎక్కడేనా కనపడితే అదే అడవి అనుకొని సంతోషించవలసి వస్తూంది మనకి. ఇంత దయనీయ స్థితికెందుకొచ్చామో మనందరికీ తెలుసు.

జంతువులమే అయినా మనకో నీతుంది. ఆకలి వేళల్లోనూ ఆహారం కోసమూ మాత్రమే వేటాడాలని. ఆ నీతిని మనందరం కచ్చితంగా పాటిస్తామని నాకు తెలుసు. ఎందుకంటే మనకది పుట్టుకతో వచ్చిన సహజ గుణం. అందువల్లనే మన సంఖ్యలో ఆ సమతుల్యత కనిపిస్తుంది.

కానీ, మనలా కాకుండా, ఆకలితో అవసరంతో నిమిత్తం లేకుండా సర్వకాల సర్వావస్థల్లోనూ కనపడ్డ ప్రతీదాన్నీ మింగడమే పనిగా పెట్టుకున్న వింత జంతువొకటి ఉంది.... క్షమించాలి. ఆ వికృత శక్తిని జంతువు అని మనతో పోల్చినందుకు. ఆ వికృత శక్తి ఎవరో మీరంతా ఈపాటికి గ్రహించే ఉంటారు.'

'ఇంకెవరు... మనిషే... మనిషే' ముక్తకంఠంతో అరిచాయి జంతువులన్నీ.

'అవును. మనిషే. ఆ మనిషి ఆకలికి భూమీ ఆకాశం పాతాళం కూడా చాలడంలేదు. ఇక మనమెంత... 'గుడినీ గుడిలోని లింగాన్నీ మింగడం' అనే సామెత వాళ్ళు తయారు చేసిందే. దాన్నిప్పుడు అక్షరాలా పాటించి చూపిస్తున్నారు. రక్షిత ప్రాంతాల పేరుతో సంరక్షణ శాలల పేరుతో ఎక్కడెక్కడో తలదాచుకుంటున్న మనల్నందర్నీ ఓ చోట పోగేసి మరీ భక్షిస్తున్నారు. అవునంటారా? కాదంటారా?'

'ఔనౌను. నిజమే... మా అభిప్రాయం కూడా అదే...' ఘోషించాయి జంతువులన్నీ.

'అందమైన మనసు లేని మనుషులకి అందమంటే ఎంత పిచ్చో. వాళ్ళకి లేని సహజ సౌందర్యం ప్రకృతి మనకిచ్చిందని ఏడుస్తారు. వెర్రిమొర్రి సౌందర్య సాధనాల తయారీ కోసం మనని ఎంత హింసించడానికైనా వెనుకాడరు. ఉన్నదాన్ని వదిలేసి లేనిదాని కోసం పాకులాడే బుద్ధీ, ఎదుటివాళ్ళ బాగు చూసి ఓర్వలేని బుద్ధీ పుట్టుకతోనే వస్తాయి కాబోలు పాడు మనుషులకి...' అసహ్యంగా సకిలించింది గుర్రం.

'అయ్యో! అదొకటేనా... మనని చంపి ఆ చర్మం మీద కూర్చుని తపస్సుచేస్తే ముక్తీ మోక్షం వస్తుందనీ కోరికలన్నీ తీరుతాయనీ నమ్ముతారట... ఎంత మూర్ఖులో...' జింక.

'చచ్చినా బతికినా మనకున్న విలువ మనిషికి లేదు. జీవంలేని మన శరీరాల్ని డ్రాయింగు రూముల్లో పెట్టుకొని మురిసిపోయే మనిషిని ఏదీ... సాటి మనిషి శవాన్ని అలా కాసేపు ఇంట్లో పెట్టుకోమనండి చూద్దాం. భయంతో హడలి ఛస్తాడు. ఆ మనిషి కాస్తా దయ్యమై ఎక్కడ పీడిస్తాడోనని. అలాంటి పిరికివాడిని చూసి మనం ఎందుకిలా భయపడుతున్నామో అర్థం కావడంలేదు' కోపంగా అంది చిరుతపులి.

'నిజమే. అయితే మనని భయపెడుతున్నది మనిషి కాదు. వెర్రితలలు వేస్తున్న అతని బుద్ధి. లేకపోతే నన్ను చూడండి. గట్టిగా నా కాలు కింద పడితే సున్నంలోకి ఎముక మిగలకుండా పచ్చడై పోయే మనిషి నా మీదే అజమాయిషీ చేస్తూ - నన్నెన్ని హింసలు పెడుతున్నాడో...' బాధగా నిట్టూర్చింది ఏనుగు.

కిచకిచలాడుతూ ముందుకొచ్చిందో ఉడుత.

ఆకలితో అవసరంతో నిమిత్తం లేకుండా సర్వకాల సర్వావస్థల్లోనూ కనపడ్డ ప్రతీదాన్నీ మింగడమే పనిగా పెట్టుకున్న వింత జంతువొకటి ఉంది... క్షమించాలి. ఆ వికృత శక్తిని జంతువు అని మనతో పోల్చినందుకు. ఆ వికృత శక్తి ఎవరో మీరంతా ఈపాటికి గ్రహించే ఉంటారు.'

'చూడ్డానికి వికారంగా ఉంటాయనీ, శవాల్ని పీక్కుతింటాయనీ రాబందులని చూసి మిగతా పక్షులు హేళన చేసేవిట. అలాంటి రాబందుల్ని కూడా మనిషిప్పుడు వదలడంలేదట. పాపం అవి మనుషుల్నే కాదు మనుషుల శవాల్ని చూసినా హడలిపోతున్నాయట... మా నేస్తం కాకి చెప్పింది...' అంది.

'ఛీ! ఛీ!...' అరిచాడు జంతువులన్నీ కంపరంగా.

'అంతేకాదు. నక్కా - కుందేలూ, నక్కా - జింకా, నక్కా - ద్రాక్షపళ్ళూ అంటూ నీతికథల పేరుతో మా జాతిని నీచాతి నీచంగా చిత్రించిన మనిషి నిజానికి ఆ కథల్లో చెప్పుకున్నది తనలోని కుటిలత్వం, స్వార్థం, అత్యాశల గురించే. తన దుర్గుణాలన్నిట్నీ మాకంటగట్టి అవమానించిన మనిషిని ఏం చేసినా తప్పులేదు' కసిగా పళ్ళు కొరికింది నక్క.

ఇన్ని జంతువులు మాట్లాడుతున్నా కోతి ఒక్క మాట కూడా అనకుండా మౌనంగా ఉండటం చూసి పులి ఆశ్చర్యపోయింది. అదే అడిగింది కోతిని.

కోతి జలజలా కన్నీళ్ళు కార్చి ఊరుకుంది మౌనంగా. జంతువులన్నీ ప్రశ్నార్థకంగా చూశాయి. కోతి నేస్తం చెవులపిల్లి లేచి నిలబడింది.

'ఎప్పుడూ సందడిగా అందరినీ నవ్విస్తూ నవ్వుతూ తిరిగే నా నేస్తం ఎందుకలా ఉందో నాకు తెలుసు. మొన్నామధ్య అడివిలో తిరిగి తిరిగి విసుగెత్తి ఊళ్ళోకి షికారుకెళ్ళింది మా నేస్తం. తనకి చిన్న పిల్లలంటే చాలా ఇష్టం కదా. అందుకని ఓ కాన్వెంటు వేపువెళ్ళి చెట్టెక్కి కూర్చుంది. పిల్లలు బయటికొచ్చి తనని చూసి నానా అల్లరీ చేస్తే, తను కూడా వాళ్ళతో కలిసి గంతులేస్తూ అల్లరి చెయ్యొచ్చని ఎంతో సంబరపడింది.

కానీ హోంవర్కులు చేసీ చేసీ దృష్టి మందగించి, స్కూలు బేగులు మోసి మోసి నడుములు వంగిపోయి మూడేళ్ళకే ముసలి ముద్దలైన కాన్వెంటు పిల్లలకి అల్లరిచేసే టైమెక్కడిదీ... పైగా ఖరీదైన ఆ కాన్వెంటులో రూల్స్ యమా స్ట్రిక్టట. వాళ్ళ లెక్క ప్రకారం పిల్లలకి అసలు ఇంటర్వెల్ కూడా అక్కర్లేదట. అంచేత మా నేస్తానికి ఎంతసేపు ఎదురుచూసినా బెత్తాలు పట్టుకు తిరిగే టీచర్లే తప్ప పిల్లలెవరూ కనిపించలేదుట. నిరాశ పడి తిరిగి రాబోతుంటే ఓ క్లాసులోంచీ 'డార్విన్ పరిణామ సిద్ధాంతం' పాఠం వినపడిందట. అప్పుడు తెలుస్తుంది మా నేస్తం మనిషి పుట్టుకకి మూలం తమ జాతేనని...

అదిగో... అప్పట్నించీ మనోవ్యాధితో తిండీ తిప్పలూ మానేసి కుంగి కృశించిపోతోంది. కదిలిస్తే చాలు... అటువంటి పరమ నికృష్ట జాతికి మూలం మేమా అంటూ ఒకటే గోల... చెప్తూ కళ్ళు తుడుచుకుంది చెవులపిల్లి.

సానుభూతిగా కోతివేపు చూశాయి జంతువులన్నీ. గొంతు సవరించుకుంటూ లేచింది పెద్దపులి. 'సభికులారా! మనిషి దౌర్జన్యానికి బలికాని జంతువు ఏదీ లేదు. ఇన్ని నేరాలూ ఘోరాలూ చేస్తున్న మనిషి విషయంలో తగు చర్య తీసుకోవాలని కోరుతున్నాను' అంది.

సింహం లేచి నిలబడింది.

'ఒకటే శిక్ష... మనమే అతడిని వేటాడటం. ఇన్ని దారుణాలకు పాల్పడుతున్న మనిషిని మనకే కాదు భూమికే పరమశత్రువుగా ప్రకృతి సాక్షిగా ప్రకటిస్తున్నాను. అటువంటి మనిషిని నమ్మినా, సేవించినా, స్నేహం చేసినా, మనిషి కనపడ్డప్పుడు వేటాడకుండా వదిలిపెట్టినా... అలాంటి నేరం చేసిన జంతువులకి ఓ భయంకర యావజ్జీవిత శిక్ష విధించబడుతుంది. ఆ శిక్షకి ఎటువంటి సడలింపూ ఇవ్వబడదు...'

జంతువులన్నీ తలలు పైకెత్తి మృగరాజు వేపు భయంభయంగా చూశాయి.

'ఆ శిక్షేమిటంటే... అప్పటినించీ ఆ జంతువుని... జీవితాంతం 'మనిషి' అని పిలవడం!'

పిల్లులూ కుక్కలూ గొర్రెలూ పందులూ గాడిదలూ దున్నపోతులతో సహా మొత్తం జంతువులన్నీ... ఆ మాటలు విని సిగ్గుతో తలలు వాల్చుకున్నాయి. ★

